# "కాల్ గర్ల్"

– రాజు

టెలిఫోన్ మ్రోగింది.

ఆ ఆఫీసు గదిలో నున్నవాళ్ళంత తలలు పైకెత్తారు. ఒకరి ముఖా లొకరు చూచుకొని ఏదో రహస్యము గ్రహించినట్లు, తలలూపు కున్నారు ఫోన్ ప్రక్కన కూర్చున్న "మూర్తి" ఫోన్ ఎత్తాడు. ఆ ఫోన్ కాల్ ఎవరికో అందరికీ తెలుసు.

మూర్తి "హల్లో!" అన్నాడు.

"........?"

"....ఆఁ....లలితా!....ఉంది! .... మీరు లైన్‌లోనే ఉండండి పిలుస్తాను!"

మూర్తి క్లాస్‌ఫోర్‌ను పిలిచి, ప్రక్క సెక్షన్‌లోనున్న లలితకు, ఫోన్ కాల్ వచ్చిందని చెప్పి పంపాడు. అందరు, వింతగా లలిత రాకకు ఎదురుచూస్తున్నారు

లలిత ఆ ఆఫీసులో టైపిస్టుగాచేరి మూడు నెలలయ్యింది. మూడు నెలలనుండి కూడ, ఆమెకు రోజు ఫోన్ కాల్సు వస్తూనే ఉన్నాయి. ఆకాల్సు ఎవరినుండో!.... ఎక్కడినుండో!... ఎందుకొరకో, ఎవరికీ తెలియదు. అయినా, ఆ ఆఫీసువాళ్ళంతా, ఆమెకు "కాల్ గర్ల్" అని బిరుదు నిచ్చారు.

క్లాస్‌ఫోర్ చెప్పగానే, లలిత వచ్చింది.

సెక్షనులో అందరు పని నిలిపివేసి, ఆమెనేచూస్తున్నారు. ఏమి మాట్లాడుతుందో విందామని, చెవులు రిక్కరించారు ఆమె అందాన్ని కళ్ళతో మేస్తున్నారు.

లలిత రిసీవరెత్తి నిల్చుంది. అందరికీ అజంతా చిత్రం గుర్తుకు వచ్చింది.

"హల్లో....లలిత స్పీకింగ్!"

లలిత మాట్లాడుతుంది - కోటి కిన్నెరలు మారుమ్రోగాయి.

"..............!"

"ఏమిటండి విశేషాలు!" లలిత పెదాలు కదులుతున్నాయి. గులాబి రేకులు గుర్తుకు వస్తున్నాయి.

"..............!"

"ఆఁ....! ఇప్పుడు రమ్మంటున్నాడా!.... వీలుకాదండి!.... అయిదు గంటలకు వస్తానని చెప్పండి!" ఈ సారి కళ్లు కలవరం చెందాయి. మాటల్లో ఏవో మబ్బులు తొంగి చూశాయి.

"................?"

"అబ్బే!.... రాలేనండి!.... మీరు ఎలాగయినా, సముదాయించండి!.... మీరు చెపుతే తప్పక వింటాడు"

ప్లీజింగ్ మూడ్‌లో మాట్లాడింది.

"................"

"థ్యాంక్సండి!...."

"................!"

"ఓ...కే....!"

లలిత రిసీవరు పెట్టేసింది. ఆ గదిలోని అందరి నోళ్ళు తెరుచుకున్నాయి. కళ్ళు ఏవో కథలు అల్లుతున్నాయి. అందరి ముఖాల్లో కోపం పేరుకుంది. ఏదో తెలియని స్వార్థం మబ్బులు క్రమ్ముకుంది.

లలిత వెళ్ళిపోయింది. అందం ఆమెతోనే పోయింది. వెలుగు ఆమె, వెనకాలే నడిచింది.

ఆ గదిలో కదలిక, కాళ్ళు దులుపుకుంది. మౌనం మాటలు నేర్చుకుంది.

ముగ్ధుడైన మూర్తి, స్వార్థంతో మేలుకొన్నాడు.

"ఎంత ధైర్యంరా. ఇప్పుడు రాలేను. అయిదు గంటలకు వస్తానంటు మాట్లాడుతున్నది!"

"మరేం చేస్తుంది! ఆఫీసు టైములో

పిలు కాదుగా?

"ఇంతకు ఏ లాడ్జిలోనుండో?"

"ఆఁ... ఇలాంటివాళ్ళకు లాడ్జీలయినసరే, ఇళ్ళల్లోనయినా సరే, డబ్బు కావాలి!... అంతే!"

"అదిసరే, విటులు ఎవరయివుంటారో?"

"మీ తెలిసి తెల్లారినట్లే ఉందిరా! ఈ పనికి ఫలానావాడు అని ఉంటుందట్రా!... ఎవడికి డబ్బుంటే వాడు!... ఎవడికి దమ్ముంటే వాడు."

"అయితే... మనకో మాత్రం డబ్బులేదా! ఆ మాత్రం దమ్ములు లేవా!"

"అయితే, ఎందుకు ఊరుకున్నావ్!"

"ఆవిడ మనతో మాట్లాడదే! ఏదో మహా పతివ్రతలా పోజు..."

"ఓరి పిచ్చిసన్నాసులు!... అలాటిపనులు వారున్న స్థలాల్లో చేసి, పెద్దవారని పించుకోరురా!"

"అయితే, మన మెలా ఊరుకుంటాం."

"ఏదేం పోతుందిరా!"

"మర్యాద!... ఇందరు మగధీరులు ఇక్కడే ఉండగా మనను చేతకాదన్నట్లు ఆ అందాన్ని పరాయివాళ్ళ పాలు చేస్తుందా!"

"అవునురా!... ఇది మనకు అవమానం!"

"అయితే మాత్రం! దానికి, మనమేమి చేయగలముదా!"

"ఆ అందాన్ని వేరేవారికి దక్కనియ్య వద్దు!"

"ఇప్పటినుండి లాడ్జీలకు, సినిమాలకు, షికార్లకు పోనీయవద్దు!"

"అంతగా, అవసరమొస్తే, మనతో తిప్పుకుందాం!"

"అందుకే, ఇప్పటినుండి, "కాల్ గర్ల్" లలితకు, ఫోన్ కాల్సు ఆపివేయాలి.

ఎప్పటికన్న, ఆరోజు, వాదం జోరుగా జరుగుతున్నది. అందరిలో ఈర్ష్య నోరు తెరుచుకుంది, కాంక్ష కరకరలాడుతున్నది. తమసొమ్ము, ఎవరో తింటున్నట్లు, కోపంగా వాదించుకుంటున్నారు.

"అయితే, మనం, ఏంచేద్దాం?"

మూర్తి ముదిరిన కోపంతో అడిగాడు.

"'కాల్ గర్ల్'ను కట్టిపారేద్దాం."

"ఎలా?"

"ఫోన్ కాల్సుని నిలిపివేయాలి!"

"లలితను పిలువగూడదు!"

"ఆమెకు తెలిస్తే...!"

"ఎవ్వరు చెప్పరు!"

"ఓ...కే...! రేపటినుండే, 'కాల్ గర్ల్'కు కాల్సు బందు!"

"షికార్లు బందు!"

* * *

పదిహేను రోజులకు లలిత ఆఫీసుకు వచ్చింది. అందరికి ఆశ్చర్యం వేసింది. ఆఫీసరు దగ్గరికి వెళ్ళివచ్చి, మౌనంగా, తన పని చూసుకుంటున్నది. ఎవరి దగ్గరికీ వెళ్ళ లేదు.

లలిత వచ్చిన సంగతి, మూర్తి అండ్ పార్టీకి తెలిసింది. ఏదో రహస్యము తెలిసినట్లు, ఏదో రహస్యము జరిగినట్లు ఏదో రహస్యము బయట పడుతున్నదన్నట్లు ఫీలవుతున్నారు.

"ఒరేయ్!...మూర్తి!...మళ్ళీ కాల్సు వస్తాయిరా. రెడీగావుండు!"

"రెడీగా ఉండటమేంటిరా!...ఫోన్ కాల్ రాగానే, రిసీవర్, క్రిందపెట్టడమేగా."

మూర్తి అండ్ పార్టీ, ఆ దినమంతా, ఎదురుచూశారు. కాని ఒక్క ఫోన్ కాల్ గూడ రాలేదు. అయిదుగంటలకు, అందరు గుమిగూడారు — ఇష్టమువచ్చినట్లు కథలు చెప్పుకుంటున్నారు.

"ఈ రోజు కాల్సురాలేదురా!"

"కాల్సు, రాకపోవచ్చు. కాల్ గర్ల్, వచ్చిందిగా చాలు!"

"పిచ్చినాయాల!... అందుకే అంటున్నారా!... ఒక్క ఫోన్ కాల్ గూడరాలేదని!"

"ఔను! ఎందుకు వస్తాయి? రావు!"

"నీకెలా తెలుసురా!"

"మీ పిచ్చిగాని. పదిహేను రోజులు పూరంతా చక్కర్లుకొట్టి వచ్చింది."

ఇలా అందరు చర్చించుకుంటుంటే, లలిత అలా ఒక్కోరాపడం చూసి ఎగతాళిగా—

"మీకు ఫోన్‌కాల్ రాలేదండీ!"

"తెలుసండీ!....ఇంక ఎప్పుడురావు!.... మీకు చాలా శ్రమగాఉండేది!....ఇంకెప్పుడు మీకు శ్రమ ఉండదు!"

"ఎప్పటికి రావండీ?"

"ఎప్పటికీ రావు!"

"ఎందుకండీ?"

"చేసేవారు లేరు కనుక!"

"ఏమయ్యారండీ?"

"చనిపోయారు!"

కంఠంలో బాధ ధ్వనించింది. బుగ్గలమీది నుండి కన్నీటి బిందువులు జారిపోయి పయిట కొంగులో మాయమయ్యాయి.

మూర్తి అండ్ పార్టీకి, ఆశ్చర్యంవేసింది.

"ఎవరండీ!"

"మా నాన్నగారు!"

అందరు నోళ్ళు తెరుచుకున్నారు.

అందరు కళ్ళు నులుపుకున్నారు.

"మీ నాన్న రోజు ఫోన్ ఎందుకు చేసేవారండి?"

మా నాన్న అప్పుడప్పుడు చేసేవాడు!.... ఎక్కువగా హాస్పిటల్. సిస్టర్ చేసేది!"

"మీ నాన్నగారు హాస్పిటల్‌లో ఉండేవారా?"

వాళ్ళ మనసులో ఏదో ఆత్రుత.

"ఔనండి!....మా నాన్న ఓ స్కూలు మాష్టరు. మాకు ఎవ్వరులేరు నేనుఉద్యోగం చేస్తేగాని పొట్టగడవదు, మా నాన్న చాలా జబ్బు పడ్డాడు. అందుకని, గవర్నమెంటు హాస్పిటల్‌లో చేర్పించాను. రాత్రులు, ఆయన దగ్గర నేనుండేదాన్ని. పగలు గూడ నన్ను దగ్గరే ఉండమనేవాడు. కాని, నాకు తెలిసిన సిస్టరుకు చెప్పి, ఆఫీసుకు వచ్చేదాన్ని. రోజు, ఎప్పటికప్పుడు, పరిస్థితినాకు ఫోన్‌లో చెప్పేది ఆ సిస్టర్. అప్పుడప్పుడు మా నాన్నగారు కూడా మాట్లాడేవారు

ఈ నెల రోజుల నుండి, పరిస్థితి చాలా విషమించింది. ఎప్పుడు నన్ను తన దగ్గరే ఉండమనేవాడు. కాని, సిస్టర్ నాకు ధైర్యం చెప్పి ఆఫీసుకు పంపేది. కాని, నన్ను ఒంటరిదాన్ని చేసి వెళ్ళిపోయాడు. ఇంకా మీరు ఫోను ఎత్తవలసిన పనిలేదు!"

లలిత నోటికి "కర్చీఫ్" అడ్డం పెట్టుకొని ఏడ్చింది. అందరికి అయోమయంగా వుంది. ఏం చెయ్యాలో అర్థం కాలేదు.

"ఎప్పుడు పోయారండీ?"

తోచక వేసిన ప్రశ్న.

"పదిహేను రోజుల క్రితం! పాపిష్టి దాన్ని. చివరిసారిగా మా నాన్నను ప్రాణముండగా చూసుకోలేకపోయాను."

"ఎందుకండీ?... మీరు వెళ్ళలేదా?"

ఎలా ఓదార్చాలో, తెలియక అడిగిన ప్రశ్న.

"ఎలా వెళ్తాను!.... ఆరోజు ఉదయము, నేను ఆఫీసుకు రాగానే, మా నాన్నకు పరిస్థితి విషమించిందట. నన్ను చూడాలన్నాడట పాపం! ఆ సిస్టర్ చాలాసార్లు నాకు ఫోను చేసిందట. కాని, ఆరోజు, ఫోన్ ఎప్పుడు ఎంగేజ్ ఉన్నట్లనిపించిందట. బహుశ ఎవరో రిసీవరును క్రింద పెట్టి ఉంటారంది. నేను సాయంత్రము వెళ్ళే సరికి, మా నాన్నగారి శవాన్ని చూశాను. కడసారిమాటకు నోచుకోలేని, దురదృష్టవంతురాల్ని. ఆఖరిసారి నన్ను చూడాలని. ఆయన ఎంత తపించాడో!...." అని వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఇంక ఎప్పుడు ఫోనుకాల్సురావు!... మీకు కష్టముండదు!....మీకుచాలాథ్యాంక్స్" కంఠంలో జీర వచ్చింది.

లలిత ముందుకు వెళ్ళిపోయింది.

అందరి కళ్ళల్లో నీళ్ళునిండాయి.

అందరి తలలు క్రిందికి వంగాయి.

మూర్తి గుండె వేగంగా కొట్టుకుంది.

★